దూరంనుంచే కిరీటిని చూసి నవ్వింది శారద.

అంతలోనే అతని వాలకం గమనించి కాస్త కంగారుపడింది. మాసిన గడ్డం. సంస్కారంలేని జుట్టు. నిద్రలేమిని సూచిస్తూ ఎర్రబారిన కళ్ళు— జబ్బుపడి లేచినవాడిలా కనిపిస్తున్నాడు.

"ఏమిటలా వున్నావ్? ఏమయింది కిరీటీ?" అంది గాభరాగా.

"ముందు నీ విషయం చెప్పు. నువ్వెందుకని మూడురోజుల నుండి కాలేజీకి రాలేదు? రోజూ సాయంత్రం మీ కాలేజీ గేటు ముందు కళ్ళు కాయలుకాచేలా ఎదురుచూడడంతప్ప వేరే ప్రయోజనం లేకపోయింది. ఏమిటి యీ మూడు రోజుల్లోనే యింత చిక్కిపోయావ్? ఒంట్లో బాగుంటంలేదా?" బదులుగా ప్రశ్నలవర్షం కురిపించాడు కిరీటి.

చిన్నగా నవ్వింది శారద. "అవును జ్వరం వచ్చింది. గట్టిగా కౌగలించుకుని ఒకపట్టాన వదల్లేదు. అందుకే కాలేజీకి రాలేకపోయాను. మరి నువ్వెందుకిలా అయిపోయావ్?"

"ఎందుకా? నువ్వు ఒక్కరోజు కనిపించకపోతే నేనేమయిపోతాను? పిచ్చివాణ్ణయిపోతాను. మీ యింటిచుట్టూ కూడా కొన్ని వందలసార్లు తిరిగాను. మీ యింటి కెదురుగా వున్న కొట్లో ముప్పైసార్లు సోడాకూడ తాగాను. నువ్వు కనిపించకపోతావా అన్న పిచ్చి ఆశ. అంతే!" ఆమెనే తదేకంగా చూస్తూ అన్నాడు కిరీటి.

శారద మాట్లాడలేదు. ఒక క్షణం అతనివైపు అదోమాదిరిగా చూసి అంది.

"నీకెందుకు నేనంటే అంత పిచ్చియిష్టం కిరీటీ? ఒకవేళ నేను నీకు కాకుండ అయిపోతే?"

"అంత మాటనకు శారదా! నా గుండాగిపోతుంది. నువ్వు లేకపోతే నేను బ్రతుకలేను. మన బంధం యీనాటిది కాదు. కొన్ని జన్మలనాటిది. కొన్నేమిటి? ఎన్నో జన్మల నుండి నిన్ను ప్రేమించి తరించడానికే నేను పుడుతున్నాను." ఉద్వేగంతో అన్నాడు కిరీటి.

శారద నవ్వింది.

ఇద్దరూ నడుస్తున్నారు. కబుర్లు చెప్పుకుంటున్నారు. వారి నడక భారమనిపించదు. కాళ్ళు నెప్పలుపుట్టవు. ప్రేమ మత్తు అలాంటిది. అందుకే ఎంతోదూరం చెట్టాపట్టాలు వేసుకుని నడిచారు. నదీతీరానికి చేరుకున్నారు. ఎప్పుడూ కూర్చునే ఇసుక తిన్నెపై చతికిలబడ్డారు. ఆ చుట్టుపక్కల ఎవరూ లేరు. చల్లటి పిల్లగాలి మాత్రం వాళ్ళను పలుకరించి ఏవేవో ఊసులు చెప్పాలని తెగ తాపత్రయపడుతోంది.

కాని వాళ్ళిద్దరూ వాళ్ళ ప్రపంచంలో వాళ్ళున్నారు. ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకుంటూ తన్మయత్వంలో మునిగి తేలుతున్నారు.

కిరీటి చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అంది శారద.

"నువ్వీ మూడురోజులూ మా కాలేజీ గేటు దగ్గర కాలుకాలిన పిల్లిలా తిరిగిన సంగతి నాకు ముందే తెలుసు."

"ఎలా తెలుసు?"

"మా మనోరమ చెప్పింది."

"మనోరమంటే ఆ పొడుగాటి అమ్మాయేనా?"

"అవును. నాకున్న ఒకే ఒక్క మంచి స్నేహితురాలు."

"ఆ అమ్మాయికి మన సంగతి పూర్తిగా తెలుసా?"

"తెలుసు. నేనే చెప్పాను. మా యిద్దరిమధ్య దాపరికాలులేవు. అన్నట్లు నీకో విషయం చెప్పనా? మా మనోరమకు నువ్వంటే చాల యిష్టం."

"నేనంటే ఎందుకిష్టం?"

"ఒక ఆడపిల్ల ఒక మగాడంటే ఎందుకిష్టపడుతుంది?" నవ్వుతూ అంది శారద.

"నీ జోక్ ఏడ్చినట్లే వుంది." తేలిగ్గా నవ్వేసి ఏదో ఆలోచనలో పడ్డాడు కిరీటి.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

"ఏమీలేదు. మీ మనోరమకు మాత్రమే మన గురించి తెలిసిన నిజం అందరికీ తెలిసేరోజు ఎప్పుడు వస్తుందా అని?"

శారద సిగ్గుపడడానికి ప్రయత్నించింది. పడింది. మళ్ళీ కిరీటే అన్నాడు.

"నిజం శారదా! ఇలా ఎన్నాళ్ళు దొంగచాటుగా కలుసుకోవడం? నిన్ను త్వరగా పెళ్ళాడేసి నీ ఒళ్ళో తల పెట్టుకుని తీరిగ్గా కలలు కనాలని వుంది."

"అప్పుడుకూడ కలలు కనడమేనా?"

"అవునుమరి. నువ్వు పిల్లల్ని కంటూవుంటే కనీసం నేను కలలైనా కనొద్దూ?" చిలిపిగా అన్నాడు కిరీటి.

"ఛీ! పో!" రెండు చేతుల్తో ముఖం దాచేసుకుంది శారద. కాస్సేపాగి తనే అంది.

"మన ఊహలన్నీ నిజమవుతాయంటావా?"

"కావూ? ఎందుకు కావు? నీ కెందుకొచ్చిందా సందేహం?"

"ఒకవేళ నేను చచ్చిపోతే?"

"నేనూ చచ్చిపోతాను. నువ్వు లేవన్న మరుక్షణమే నేనూ ప్రాణాలు విడుస్తాను."

"అంతేనా? షాజహాన్‌లా నాకొక తాజ్‌మహల్ కట్టిస్తావనుకున్నాను." నవ్వింది శారద.

"అవును నిజమే! నేను చావను. నీకోసం ఒక్కటేమిటి? వెయ్యి తాజ్‌మహల్‌లు కట్టిస్తాను. లోకమంతా మన పవిత్ర ప్రేమ గురించి చాటి మరీ చస్తాను." ఆవేశంతో అన్నాడు కిరీటి.

కిరీటి వంక ప్రేమలో చూసింది శారద.

"నన్నింతగా ప్రేమించే నీ సాంగత్యం లభించడం నిజంగా నా అదృష్టం కిరీటీ!" అంది.

కాని ఆ అదృష్టాన్నే కాదనుకుని కొన్నాళ్ళ తరువాత ఆమె మరో స్థితిపరుడ్ని పెళ్ళాడేస్తుందని కిరీటి అప్పట్లో ఊహించలేకపోయాడు. అతని అభ్యర్థనల్ని త్రోసిపుచ్చి ఆమె తన దారి తాను చూసుకుంది. ఎందుకిలా చేసావని అతడు నిలదీసి అడిగితే ప్రేమ వేరు — పెళ్లి వేరు. నన్నాట్టే విసిగించకు అని కుండ బద్దలుకొట్టినట్లు చెప్పేసింది.

ఆమె మోసం చేసిందన్న షాక్ నుండి కిరీటి తట్టుకోలేకపోయాడు. రోడ్లవెంట పిచ్చివాడిలా తిరిగాడు. అర్జంటుగా తాగుబోతుగా మారాడు.



అతడు తప్పతాగి నడిరోడ్డు మీద తెలివితప్పి పడిపోయినప్పుడు ఆ వార్త మనోరమ శారదకు చేరవేసింది. శారదలో కించిత్తు చలనంకూడ కలుగలేదు. చిన్నగా నవ్వేసి ఊరుకొంది.

ఆ తరువాత కిరీటి పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారయింది. మితిమీరిన తాగుడు మూలంగా ఆరోగ్యం పూర్తిగా చెడిపోగా అతడ్ని టి. బి. శానిటోరియంలో చేర్పించారు మనోరమ పనిగట్టుకుని వెళ్లి యీ విషయం శారదకు తెలియజేసింది.

"అవును మనూ! ఆమధ్య మీ కుక్కకు జబ్బు చేసిందన్నావు? ఎలాగుందిప్పుడు? బాగా తిరుగుతోందా?" అంది శారద బదులుగా ఆ శునకరాజంమీద తనకున్న ప్రేమను వ్యక్తం చేస్తూ.

ఆ క్షణంలో మనోరమ శారద వైపు చాల ఈసడింపుగా చూసింది. "నీకు నిజంగా హృదయం లేదు. నీవంటి నీచురాలు నా స్నేహితురాలు అని చెప్పుకోవడంకూడ సిగ్గుచేటు." అనేసి చరచరా వెళ్ళిపోయింది.

నీరసంగా మందహాసంచేసి ఊరుకొంది శారద.

ఆ తర్వాత మనోరమ మళ్ళీ శారదను కలుసుకోలేదు. శారదకూ కిరీటి వివరాలేమీ తెలియలేదు. ఈ కథ అప్పటికంతటితో ఆగిపోయింది. ఆగి కొన్నాళ్ళ తరువాత ఒక పెద్ద పట్నంలో మళ్ళీ మొదలయ్యింది.

ఆ టైమ్‌లో శారద చేతిగడియారంలో టైము చూసుకుంటూ ఒక బస్‌స్టాప్‌లో నిలబడి వుంది. ఆమె ముఖంలో పూర్వపు కళాకాంతుల్లేవు. మనిషి చాల నీరసంగా అగుపిస్తోంది. జీవితంమీద

# మహాలే కోసం?

## విజయ్



విసుగు, బస్ రాలేదన్న విసుగు సమ్మిళితమై ఆమె ముఖంమీద ప్రతిబింబిస్తున్నాయి.

అప్పుడే ఆమె నిలబడ్డ బస్‌స్టాప్ పక్కగా వచ్చి ఆగిందో అందమైన కారు. ఆ కారులోనుండి బయటకు దిగిన వ్యక్తిని ఆమె తేలిగ్గానే పోల్చుకుంది. అతడు కిరీటి. కారు బాక్ డోర్ తెరుచుకుని బుట్టబొమ్మలా వున్న పాప కాలు క్రింద పెట్టింది. కిరీటి అక్కడే వున్న ఐస్‌క్రీమ్ బండివాడ్ని పిలిచాడు. ఐస్‌క్రీమ్ తీసుకుని పాప చేతిలో వుంచాడు. పాప కళ్లు ఆనందంతో మెరిసాయి. మరో ఐస్‌క్రీమ్ తీసుకుని కారువైపు నడిచాడు. వంగి లోపలవున్న భార్యకు కాబోలు అందించాడు. అందించి అంటున్నాడు.

"నువ్వు రోజు రోజుకీ మరీ చిన్నపిల్లవయి పోతున్నావ్. ఐస్‌క్రీమ్ కొనిపించడానికి బేబీ ఒకటి వంక దొరికింది నీకు."

ఆమె నవ్వింది. చాల తృప్తిగా గర్వంగా నవ్వింది.

కిరీటి పర్సు తెరిచాడు. అయిదురూపాయల నోటు తీసి ఐస్‌క్రీం వాడి కిచ్చాడు.

"నోటు నలిగిపోయింది సార్! మరొకటివ్వండి!"

కిరీటి చిరాగ్గా చూసా డతడ్ని.

"నాదగ్గర మరో చిన్న నోటు లేదు. వంద నోటుకి చిల్లరుందా?" దర్పంగా అన్నాడు.

ఐస్‌క్రీమ్ వాడు గొణుక్కుని ఆ అయిదునోటే జేబులో వేసుకుని చిల్లరిచ్చాడు.

కిరీటి కారెక్కాడు. మరుక్షణంలో కారు వేగంగా ముందుకు దూసుకుపోయింది.

ఆ కారు సరిగ్గా తన గుండెలమీదనుండే పోయినట్లు ఫీలయ్యింది శారద. గుండెల్లో తెలియని బాధ చురుక్కుమని పొడుస్తోంది. పూర్తిగా ఎదురుచూడని సంఘటన తనని తాను తమాయించుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఇంకా నయం తనని చూసాడుకాదు. చూస్తే వెటకారంగా నవ్వివుండేవాడేమో? ఏమో?

తన ఆలోచనలను చంపి పాతిపెట్టేయాలన్నంత కోపం వస్తోంది శారదకు. తల గట్టిగా విదిలించింది. ఐస్‌క్రీం బండివాడివైపు చూసింది. "నేనూ ఐస్‌క్రీమ్ తింటాను. తినలేనా?" కసిగా అనుకుంది. అటు నడిచింది. ఐస్‌క్రీమ్ తింటుంటే చల్లగాలేదు. చాలా వేడిగా వుందనిపించింది. తనిచ్చిన పదిరూపాయల నోటు అందుకుని వాడిచ్చిన చిల్లరలో అంతకుముందు కిరీటి యిచ్చిన అయిదు రూపాయల నోటు కూడ వుండడం గమనించింది. నీరసంగా నవ్వుకుంది. ఆప్యాయంగా ఆ నోటును నిమిరింది.

మళ్ళీ కథ మొదలయ్యిన రోజు సాయంత్రం శారద ఆఫీసు నుండి తిరిగివస్తూ ఎదురైన మనిషిని చూసి ఆగిపోయింది.

ఆ మనిషి మనోరమ.

కొన్ని ఏళ్ళ తరువాత కలుసుకున్న స్నేహితురాళ్ళు ఎలా ప్రవర్తిస్తారో వాళ్ళూ సరిగ్గా అలాగే ప్రవర్తించారు.

మనోరమ శారదను తన యింటికి తీసుకు వెళ్ళింది. తనక్కడ కాన్వెంట్‌లో టీచర్‌గా పని చేస్తున్నానని చెప్పింది. నువ్వింకా పెళ్ళెందుకు చేసుకోలేదన్న ప్రశ్నకు బదులుగా నవ్వింది. నవ్వి శారద సంసారమెలా సాగుతున్నదీ అడిగింది.

శారద ముఖం వివర్ణమయిపోయింది. మౌనంగా నిట్టూర్చింది.

ఆ నిట్టూర్పుకు కారణం చెప్పమని మనోరమ ప్రశ్నలతో వేధించిన తరువాత నీకు చెప్పకపోతే నేనింకెవరికి చెప్తానే మనూ! తప్పకుండా చెప్తానంటూ యిలా చెప్పింది.

"పెళ్ళయిన తరువాత కొంతకాలం వరకు ప్రతి ఆడపిల్ల జీవితం ఎంత కమ్మగా సాగిపోతుందో నా విషయంలోనూ అలాగే జరిగింది. నీకు తెలుసుగా నా భర్తకు చాల ఆస్తి వుందని. ఆయనకు వ్యాపారంలో నష్టం రావడంతో ఆస్తికాస్తా హరించుకుపోయింది. దానికి నేనేమీ బాధపడలేదు. కాని..." ఒక క్షణం ఆగింది.

"కాని..." అని మళ్ళీ మనోరమ రెట్టించ లేదు. మౌనంగా ఊరుకొంది.

మళ్ళీ శారదే మొదలెట్టింది.

"మా పెళ్లి కాకముందే ఆయనకు గాంధర్వ వివాహంలాంటి దొకటి జరిగిందని నాకు తర్వాతే తెలిసింది ఆమెను ఆయన ఒదులుకోలేదు. అది నేను భరించలేను. దాంతో నేను ఉద్యోగంలో చేరాను. ఆయన కప్పుడప్పుడూ నేను గుర్తుకొస్తుంటాను. నాకిలా జరగాల్సిందేలే! నేను చేసిన తప్పుకు అనుభవిస్తున్నాను కిరీటికి నే నన్యాయం చేసినా దేవుడు అతనికి మేలే చేసాడు. పెళ్ళాం బిడ్డలతో హాయిగా వున్నాడు."

"కిరీటిని నువ్వు కలిసావా?"

"లేదు. ఒకరోజు నేను బస్‌కోసం ఎదురు చూస్తుంటే భార్యాబిడ్డలతో కార్లో పోతూ కనిపించాడు."

ఇద్దరూ కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయారు.

"శారదా! ఒక మాటడగనా?"

"నువ్వే మడుగుతావో నాకు తెలుసు మనూ! కిరీటికి నేనెందుకలా అన్యాయం చేసాననేకదూ? నీకీ రోజు ఆ విషయంకూడ చెప్తాను. నీ స్నేహితురాలు ఎంత పిచ్చిదో నీకైనా తెలియాలి తెలిసితీరాలి." మనోరమ మాటలకు అడ్డొస్తూ అంది శారద.

"కిరీటిని నేను హృదయపూర్వకంగానే ప్రేమించాను. అతడూ నన్నూ అంత పిచ్చిగా ఆరాధించాడు. కిరీటికి నాపై వున్న ప్రేమకు లోలోనే మురిసిపోతూ నాఅంతటి అదృష్టవంతురాలు మరి వుండదని అనుకుంటూ వుండేదాన్ని.

ఒకరోజు అతడ్ని నేను లేకుండపోతే ఏం చేస్తావని అడిగాను. నేను లేని జీవితం తన కొద్దన్నాడు. నేను కన్నుమూస్తే నాకోసం వెయ్యి తాజ్‌మహల్‌లు కట్టిస్తానన్నాడు. తనూ ప్రాణ త్యాగం చేస్తానన్నాడు. సరిగ్గా అదే క్షణంలో పుట్టింది నాలో ఒక వెర్రి ఆలోచన. నేను దూరమైపోతే కిరీటి పిచ్చివాడైపోతాడని తెలుసు. నాకోసం అలమటిస్తూ తిరుగుతాడనీ తెలుసు. నే నతడ్ని మోసంచేస్తే నా ప్రేమపిచ్చిలో పడి నాకొక చరిత్ర కల్పిస్తాడనుకున్నాను. దేవదాసు, మజ్నూల వంటి అమరప్రేమికుల జాబితాలో అతడు కూడ స్థానం కల్పించుకోగలిగితే పరోక్షంగా ఆ ఖ్యాతి నాకుకూడ దక్కుతుందనుకున్నాను. నా యీ మూర్ఖపు ఆలోచన నన్ను పూర్తిగా కమ్మేసింది. ఊహల్లో విహరించానేగాని నా ఆలోచనలు ఎంత పెడత్రోవను తొక్కుతున్నాయో గ్రహించే పరిస్థితిలో నేను లేను. అందుకే నా ప్రేమను చంపుకుని అతనికి దూరమయ్యాను. మొదట్లో నేనను కున్నట్లు జరుగుతుండడం గమనించి సంతోషించాను. చివరి కేమయింది? నేనే సర్వనాశనమయిపోయాను. నా స్వయంకృతానికి ఫలితం అనుభవిస్తున్నాను. మనూ! నావంటి పిచ్చిది మరొకటి వుండదు. ఉండకూడదు" మనోరమ చేతుల్లో తల దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది శారద. మనోరమ మాట్లాడలేదు. ఆమె నలాగే ఏడ్వనిచ్చింది. శారద వెళ్ళిపోయిన తరువాత తనలో తాను అదోరకంగా నవ్వుకుంది.

* * *

క్లాసులో నుండి బయటకు వస్తూ ఎదురైన కిరీటిని చూసి ఆగిపోయింది మనోరమ.

"మనోరమగారూ! మీరిక్కడా?" నవ్వుతూ పలకరించాడు కిరీటి.

"నన్ను గుర్తుపట్టారా? నేనిక్కడే టీచర్‌గా పని చేస్తున్నాను." నెమ్మదిగా అంది మనోరమ.

"భలేవారే! తెలిసినవాళ్ళ నంత తేలిగ్గా మరిచిపోయేవాణ్ణికాదు నేను."

మనోరమ కళ్ళల్లో చిన్న మెరుపు తృటికాలం మెరిసి మాయమైపోయింది.

"మా బేబీని కాన్వెంటులో చేర్పించుదామని

# 1976లో విడుదలైన చిత్రాలు

| చిత్రం | దర్శకత్వం | సంగీతం | చిత్రం | దర్శకత్వం | సంగీతం |
|---|---|---|---|---|---|
| వేములవాడ భీమకవి | ఎన్. టి. రామారావు | రాజేశ్వరరావు | నేరం నాదికాదు ఆకలిది (కలర్) | ఎస్. డి. లాల్ | సత్యం |
| పిచ్చిమారాజు (కలర్) | వి. రాజేంద్రప్రసాద్ | కె. వి. మహదేవన్ | రాజా వెడలె (కలర్) | తాతినేని రామారావు | కె. వి. మహదేవన్ |
| పాడిపంటలు | పి. చంద్రశేఖరరెడ్డి | కె. వి. మహదేవన్ | నిజం నిద్రపోదు | రాజశ్రీ | సత్యం |
| కోటలోపాగా | విఠలాచార్య | జె. వి. రాఘవులు | ప్రేమాయణం | నాగాంజనేయులు | కె. వి. మహదేవన్ |
| యవ్వనం కాటేసింది | దాసరి నారాయణరావు | చక్రవర్తి | ఆదిమానవులు | జి. కె. మూర్తి | సత్యం |
| అందరూ బాగుండాలి | పి. పుల్లయ్య | మాస్టర్ వేణు | అమ్మా – నాన్న | లెనిన్‌బాబు | చలపతిరావు |
| ఇద్దరూ ఇద్దరే (కలర్) | వి. మధుసూదనరావు | చక్రవర్తి | పొరుగింటి పుల్లకూర | వి. మధుసూదనరావు | చక్రవర్తి |
| శ్రీ రాజేశ్వరీ విలాస్ కాఫీక్లబ్ (కలర్) | చక్రపాణి – బాపు | పెండ్యాల | బంగారు మనిషి (కలర్) | భీమ్‌సింగ్ | కె. వి. మహదేవన్ |
| అంతులేని కథ | కె. బాలచందర్ | ఎమ్. ఎస్. విశ్వనాథం | పొగరుబోతు (కలర్) | టి. ప్రకాశరావు | కె. వి. మహదేవన్ |
| అయినవాళ్ళు | కె ఈశ్వరరావు | శ్రీరాజ్ | పాడవోయి భారతీయుడా | దాసరి నారాయణరావు | కె. వి. మహదేవన్ |
| వింత యిల్లు – సంతగోల | లక్ష్మీదీపక్ | శంకర్ | వధూవరులు | ఎస్. డి. విజయబాబు | మాస్టర్ వేణు |
| ఆరాధన (కలర్) | బి. వి. ప్రసాద్ | ఎస్. హనుమంతరావు | మా దైవం (కలర్) | ఎస్. ఎస్. బాలన్ | కె. వి. మహదేవన్ |
| ప్రేమబంధం (కలర్) | కె. విశ్వనాథ్ | కె. వి. మహదేవన్ | కొల్లేటి కాపురం (కలర్) | తిలక్ | పెండ్యాల |
| కవిత | విజయనిర్మల | రమేష్‌నాయుడు | మొనగాడు (కలర్) | టి. కృష్ణ | కె. వి. మహదేవన్ |
| మహాకవి క్షేత్రయ్య (కలర్) | ఆదుర్తి–సి.ఎస్.రావ్ | ఆదినారాయణరావు | సుప్రభాతం | కె. ఎస్. ప్రకాశరావు | పెండ్యాల |
| మనుషులంతా ఒక్కటే (కలర్) | దాసరి నారాయణరావు | రాజేశ్వరరావు | పెళ్లాడే బొమ్మ | చక్రవర్తి | సత్యం |
| ఆస్తికోసం | గిడుతూరి సూర్యం | ఎస్. హనుమంతరావు | ఆడవాళ్ళు – అపనిందలు | బి. ఎస్. నారాయణ | జి. కె. వెంకటేష్ |
| ఈకాలపు పిల్లలు | లక్ష్మీదీపక్ | సత్యం | మహాత్ముడు (కలర్) | గోపీనాథ్ | చలపతిరావు |
| వనజ – గిరిజ | గౌతమ్ | టి. చలపతిరావు | మనిషి రోడ్డున పడ్డాడు | సి. వి. రమణ్ జీ | శంకర్ గణేష్ |
| సెక్రెటరీ (కలర్) | కె. ఎస్. ప్రకాశరావు | కె. వి. మహదేవన్ | తూర్పు – పడమర | దాసరి నారాయణరావు | రమేష్‌నాయుడు |
| నాపేరే భగవాన్ (కలర్) | ఎస్. డి. లాల్ | సత్యం | భలే దొంగలు (కలర్) | కె. ఎస్. ఆర్. దాస్ | సత్యం |
| దొరలు – దొంగలు (కలర్) | కె. ఎస్. ఆర్. దాస్ | సత్యం | పెళ్లికాని తండ్రి | పద్మనాభం | శంకర్ |
| మగాడు (కలర్) | ఎస్. డి. లాల్ | కె. వి. మహదేవన్ | ఒక దీపం వెలిగింది | సింగీతం శ్రీనివాసరావు | ఎస్. రాజేశ్వరరావు |
| భక్తకన్నప్ప (కలర్) | బాపు | సత్యం | శీలానికి శిక్ష | డి. ఎస్. ప్రకాశరావు | కె. వి. మహదేవన్ |
| నాడు – నేడు | పి. శేఖర్ | సత్యం | దేవుడు చేసిన బొమ్మలు | హనుమాన్‌ప్రసాద్ | సత్యం |
| ముద్దబంతిపువ్వు | దాసరి నారాయణరావు | రమేష్‌నాయుడు | అమెరికా అమ్మాయి (కలర్) | సింగీతం శ్రీనివాసరావు | జి. కె. వెంకటేష్ |
| జ్యోతి | కె. రాఘవేంద్రరావు | చక్రవర్తి | దేవుడే గెలిచాడు (కలర్) | విజయనిర్మల | రమేష్‌నాయుడు |
| అల్లుడొచ్చాడు | కె. ప్రత్యగాత్మ | చలపతిరావు | మంచికి మరో పేరు (కలర్) | సి. ఎస్. రావ్ | ఎస్. రాజేశ్వరరావు |
| మన వూరి కథ (కలర్) | కె.హేమాంబరధరరావు | జె. వి. రాఘవులు | రాజా (కలర్) | కె. రాఘవేంద్రరావు | చక్రవర్తి |
| ముగ్గురు మూర్ఖులు | మహేష్ | చక్రవర్తి | సిరి సిరి మువ్వ (కలర్) | కె. విశ్వనాథ్ | కె. వి. మహదేవన్ |
| రామరాజ్యంలో రక్తపాశం (కలర్) | పి. సాంబశివరావు | కె. వి. మహదేవన్ | పెద్దన్నయ్య | పి. డి. ప్రసాద్ | సత్యం |
| మాంగల్యానికి మరో ముడి | కె విశ్వనాథ్ | కె. వి. మహదేవన్ | | | |
| సీతా కళ్యాణం (కలర్) | బాపు | కె. వి. మహదేవన్ | | | |

—[ కళ్యాణి ]

వచ్చాను. అడ్మిషన్ పూర్తయింది. రేపటినుండి రెగ్యులర్‌గా పంపిస్తాను.'' అన్నాడు కిరీటి.

ముద్దొస్తున్న బేబీని ఎత్తుకుని "నీ పేరేమిటి పాపా!'' అంది మనోరమ.

"స్మిత'' అంది బేబీ మరింత ముద్దుగా.

'రండి' అంటూ టీచర్స్ రూమ్‌లోకి దారితీసింది మనోరమ.

ఆ రూమ్‌లో మరెవ్వరూ లేరు.

'కూర్చోండి' అంది కుర్చీ చూపిస్తూ.

కొన్ని క్షణాలు వాళ్ళేమీ మాట్లాడలేదు.

కాస్సేపటికి కిరీటే అన్నాడు.

"చూడండి మనోరమగారూ! మీరెవరో నాకు తెలుసు. నేనూ మీకు తెలుసు, అయినా మనం మొట్టమొదటిసారి కలిసి మాట్లాడుకునే అవకాశం చివరికి యిలా కలిగింది. మనం ఎవరి ద్వారా ఒకరి కొకరు తెలిసామో ఆ శారద ఇప్పుడీ



## తాజ్‌మహల్ కోసం

ఊర్లోనే వుంది, మీకు తెలుసా?''

"ఓహో! అలాగా!'' ముక్తసరిగా అంది మనోరమ. కాని లోలోనే ఆశ్చర్యపడింది కిరీటికి ఆ విషయం ఎలా తెలుసా అని.

అందుకే అడిగేసింది.

బాధగా నవ్వాడు కిరీటి. "ఆమె విషయాలు నే నెప్పటికప్పుడు తెలుసుకుంటూనేవున్నాను. ఈమధ్యనే ఆమెను బస్‌స్టాప్‌లో చూసాను. ఆమె నన్ను చూసింది. నేనే చూడనట్లు నటించాను. నిజానికి శారద నక్కడ చూసి చాల చలించాను. అయినా నన్ను నేను అదుపులో పెట్టుకున్నాను. ఆరోజుల్లో ఆమె ఒక్కసారి కనిపిస్తే చాలని వాళ్ళ యింటిచుట్టూ పిచ్చిగా తిరిగేవాడ్ని. ఈరోజున ఆమెను గమనించనట్లే వెళ్ళిపోయాను. ఎందుకో తెలుసా? మనోరమగారూ! నేనిప్పుడు బంధితుడ్ని సంసార బంధంలో కట్టుబడిపోయాను. నా పరిధి దాటి నేను బయటకు రాలేను. అలా చెయ్యడం నాభార్యాబిడ్డలకు అన్యాయం చెయ్యడమేఅవుతుంది.''

నిజానికి నన్ను తిరస్కరించి శారద ఏం బావుకుంది? ఉన్నట్లుండి తన మనసు మార్చుకుని నన్నెందుకు త్యజీకరించిందన్న విషయం నా కిప్పటికీ ఒక శేష ప్రశ్నగానే మిగిలిపోయింది. బహుశా జీవితంలో ఆ ప్రశ్నకు సమాధానం తెలుసుకోలేను. తెలుసుకోవడానికి ప్రయత్నించే సాహసమూ చెయ్యలేను.'' బరువుగా నిట్టూర్చాడు కిరీటి.

మనోరమ పెదవి విప్పలేదు. అతడు చెప్పేదంతా వింటూ కూర్చుంది.

"ఇక నేను వెళ్తాను మనోరమగారూ! మళ్లీ కలుద్దాం'' లేచాడు కిరీటి.

అతడు కనుమరుగయిన తరువాత వేదాంత ధోరణిలో చిన్నగా నవ్వుకుంది అవివాహితగానే మిగిలిపోయిన మనోరమ.